
# ఎమ్.ఏ. చదివీ సిగ్గు పడింది



**శారదా అశోకవర్ధన్**

**మూతి ముడుచుకు కూర్చున్న మేఘమాల కోపానికి కారణం తెలీక తికమక పడ్డాడు కేదార్. ఆ మూడ్‌లో ఏం మాట్లాడినా ఎలాంటి సమాధానం వస్తుందో కేదార్‌కి బాగా తెలుసు. అందుకే ఏమీ తెలీని వాడిలాగా, తనలోతానే మాట్లాడుకుంటూ న్నట్టుగా -**


"ఏమిటో మరీ అన్యాయం, సాయంత్రం ఇంకా ఆరు గంటలైనా కాలేదు, ఇంత చీకటి పడిపోయింది! పైగా చలొకటి! విపరీతంగా వెన్నులోంచి వొణుకు పుట్టిస్తోంది'' అన్నాడు మేఘమాల కేసి ఓరకంట చూస్తూ కేదార్. అయినా మేఘమాల నోరు మెదపలేదు. ఏదో సీరియస్ విషయమే అయ్యుంటుందని "ఏమిటబ్బా అది. ఆమెకంత కోపం తెప్పించేపని ఏం చేశానూ?'' అనుకుంటూ, "మేఘా! కాఫీ ఇవ్వవూ?'' అడిగాడు కేదార్.

"ఎందికవ్వనూ? వంట మనిషినీ, పనిమనిషినీ అన్నీ నేనున్నాగా! చెప్పండి సార్? ఒక్క కాఫీ చాలా? వేడి వేడిగా టిఫినేమైనా కూడా చేసి పెట్టాలా? మొహమాట పడకండి సార్'' అంది మేఘమాల లేచి వంటింట్లోకి వెడుతూ.

"కాఫీచాలు'' అంటూ వెనకాలే వంటింట్లోకి వెళ్లాడు కేదార్.

మేఘమాల సీరియస్‌గా కాఫీ కలుపుతోంది, కేదార్ రావడం గమనించనట్టుగా!

"అమ్మ ఏమన్నా అందా?'' అనునయంగా




అడిగాడు.

"లేదు" ముక్తసరిగా సమాధానం చెప్పింది.

"నాన్నగారేమైనా..."

"ఆయనేమంటారు పాపం!" కసురుతున్నట్టుగా అంది.

అయినా కేదార్ నెమ్మదిగా "మేఘా! అయితే ఎందుకిలా ఉన్నావ్?" అడిగాడు.

"ఎలా ఉన్నాను?" రుసరుసలాడుతూ చూసింది మేఘమాల.

"అలా చూడకు. నేను తట్టుకోలేను. నీ గుండ్రని కళ్ల వెన్నెల కిరణాలను వెదజల్లాలి. నీ కళ్లల్లోని కాంతి నాకు వెలుగు బాటై నడిపించాలి" అన్నాడు కవిత్వం చెబుతున్నట్టుగా, ఆమె మూడ్‌ని మార్చాలని చూస్తూ!

కేదార్‌కి అర్థమైపోయింది. ఆమె కోపం తన మీదేనని? అయితే కారణమేమిటో తెలీలేదు. అతనికి తెలుసు ఆ మూడ్‌లో ఆమెని తను ఎన్ని ప్రశ్నలు వేసినా, ఇలాంటి తిక్క సమాధానాలే చెబుతుంది తప్ప తిన్నగా మాట్లాడదని. అందుకే ఆమె రుసరుసలాడుతూ అందించిన కాఫీ మగ్గునందుకుని, సోఫాలో కూర్చున్నాడు. ఆ ఉదయాన చదివిన దినపత్రికనే మరోసారి తిరగేస్తూ.

కేదార్‌కి తెలుసు మరో విషయం కూడా అతడు అడగడం మానేస్తే ఆమే చెప్పేస్తుంది. అతడు అడగడం లేదన్న ఉక్రోషంతో. కానీ ఈసారి కేదార్ అంచనా తప్పయింది. ఆమె మాట్లాడలేదు. తన కోపాన్ని వంటింట్లో గరిటెల మీదా, గిన్నెల మీద చూపిస్తోంది. అంతే కాకుండా అప్పుడే ఆడుకోవడమయిపోయి ఇంటికొచ్చిన మనోజ్ఞ, మనోహర్‌లను ఒక్క కసురు కసిరింది "వెళ్లి హోంవర్కు చేసుకొండి" అంటూ.

"నాన్నారూ.... మీరేమో... నేను" ఏదో చెప్పబోతున్న మనోజ్ఞని లోపల్నించే కసిరింది మేఘమాల "మనోజ్ఞా... వెళ్లి హోంవర్క్ చేసుకోమన్నానా? ఏమిటి వాగుతున్నావ్?" అంటూ వంటింట్లోంచే అరిచి చెప్పడంతో మేఘమాల కోపం ఇంకా దిగలేదు సరికదా ఎక్కువయిందని గ్రహించి "మనోజ్ఞా! వెళ్లిహోంవర్కు చేసుకోమ్మా" అన్నాడు కేదార్. మనోజ్ఞ, మనోహర్ లిద్దరూ వెళ్లి హోంవర్కు చేసుకోవడంలో నిమగ్నమయ్యారు.

ఆ సాయంత్రం అంతా కూడా మేఘమాల తనతో గానీ, ఇంట్లో అత్తమామలతో గానీ ఒక్కమాట మాట్లాడకుండా తన పని తను యంత్రంలా చేసుకుంటూపోయింది.

"అమ్మ కోపంగా ఉంది నాన్నమీద" అనుకుంటూ పిల్లలు బుద్ధిగా హోంవర్కు చేసుకుని, భోంచేసి పడుకున్నారు. కోడలి కోపానికి కారణం తెలీని రామశేషయ్య గారూ ఇందిరాదేవీ కూడా భోజనాల దగ్గర నోరెత్తకుండా భోంచేసి, వాళ్ల గదిలో కెళ్లి పడుకున్నారు.

కేదార్ మాత్రం ఏదో అగ్ని పర్వతం త్వరలోనే బద్దలవుతుందా లేక ఉప్పెన ఏదైనా ముంచుకొస్తుందా అన్నట్టు ఎలా అవి రాకుండా అరికట్టాలా అని ఆలోచిస్తూ మౌనంగా భోజనం ముగించాడు. ఏదో తిన్నాననిపించి చెయ్యి కడుక్కుంది మేఘమాల.

కలత నిద్రతో తినగానే కాస్సేపు కళ్లు మూసుకుని నిద్రపోయినా, కేదార్ గదిలోంచి పెద్ద పెద్ద మాటలకు తెలివొచ్చేసి వినడం సభ్యత కాదని అనుకుంటూనే వింది భయం భయంగా ఇందిరాదేవి.

"పెళ్లయిన ఇన్నేళ్లలో నాకిది కావాలీ, అది కావాలీ అని ఏనాడైనా మీతో పోట్లాడానా?" అంది మేఘమాల.

"అడక్కుండానే అన్నీ తెచ్చిపెడుతూంటే పోట్లాటెలా వస్తుంది" మామూలుగా ఉంది కేదార్ స్వరం.

"ఏమిచ్చారు. నగలా? నాణ్యాలా? మీ చెల్లెలు సునీత కాసుల పేరు చేయించుకుంది. మీ అక్క నీరజ ఎర్ర రాళ్లూ, ముత్యాలూ ఉన్న నెక్‌లెస్ చేయించుకుంది. అటువంటివి నేనేమన్నా అడిగానా?"

"ఒకరేదో కొనుక్కున్నారని నన్ను కొనమనడం, అయినా ఇలా వాళ్లు కొన్నారనీ, వీళ్లు కొన్నారనీ పోటీలు పడి కొనడం వెర్రితనం! అజ్ఞానం!" మామూలు స్వరంతోనే అన్నాడు కేదార్.

"అవును. నేనేదడిగినా అజ్ఞానం! అవివేకం! మొన్న మనింటి దగ్గర ఓపెన్ చేసిన కంచి పట్టు చీరల దుకాణాన్ని సినీనటి సౌందర్య ఓపెన్ చేసింది. ఒక చీర వెయ్యి రూపాయలది కొంటే అయిదు వందల రూపాయల చీర ఉచితం అంటే మా అక్క భాను కొనుక్కుంది. నిన్న ఆబిడ్స్‌లో ఒక అయిదు వందల రూపాయల చీరకొంటే, ఒక స్టీలు బిందె ఉచితం అంటే మా చెల్లెలు లక్ష్మీ కొనుక్కుంది. నా ఫ్రెండ్సు అనితా, కుసుమా రాణీ అందరూ కొనుక్కున్నారు. నేనే! ఎప్పుడూ ఏదీ లేకుండా పడుంటాను" వెర్రి దానిలా అరుస్తూ నొక్కి నొక్కి చెప్పింది మేఘమాల!

"మేఘా! ఈ మాటలనడానికి నీకు నోరెలా వచ్చింది. ఏ ఊరెళ్లినా ఆ ఊరు చీరలు నీకు కనీసం రెండో మూడో తెస్తాను. ఆ తరవాత నీ అక్క నీ చెల్లెళ్లకీ, మీ అమ్మకీ తెస్తాను. ఆ సంగతి ఇంట్లో ఉన్న మా అమ్మకి కూడా చెప్పనూ లేను. నా అక్క చెల్లెళ్లకి ఏడాది కోసారో నీ ఇష్టమొచ్చినప్పుడో తెచ్చే వందరూపాయల చీరలు నాచేత్తోనే ఇస్తే, నాకేమీ తెలీనట్టే ఉంటాను. అయినా నీకీ పోటీమాటలు ఏమిటి? ఛీ... ఛీ! నా ఖర్మ"

"అవును! నన్ను చేసుకోవడం మీ ఖర్మ! నాతో సంసారం చెయ్యడం మీ ఖర్మ!"

ఇదంతా బిక్కమొహం వేసుకుని వింటున్న ఇందిరాదేవి, గుర్రుపెట్టి పడుకున్న భర్తను లేపి ఆ మాటలు వినమంది, ఆయన ఆవులిస్తూనే విన్నాడు.

"నా కన్నా, నా వాళ్లకన్నా మీ వాళ్లెవరయినా సరే, నాకన్నా ఎక్కువగా ఉంటే నేను భరించలేను. మీ వాళ్లంటే నాకసహ్యం. మీ అమ్మంటే అసహ్యం! మీ అక్కంటే అసహ్యం....! మీ చెల్లెలంటే అసహ్యం! అసలు మీ ఇంట్లో ఉన్న కుక్కా, పిల్లీ కూడా నాకసహ్యామే!. కసితో రెచ్చిపోతూ అరిచింది మేఘమాల.

"నేనన్నా అసహ్యమేనా? అదీ చెప్పు"

"నా మాట కాదని నువ్వు నీ వాళ్లకేం చేసినా నా కసహ్యమే."

"నా మాట కాదని నువ్వు నీవాళ్లకేం చేసినా నాకస్యహమే"

"నీకు నీ వాళ్లంటే ఎంతో నాకు నా వాళ్లంటే అంతే కదా?"

"మీరిలాగే వాదించండి. ఈ రాత్రి ఇక్కడే ఉరి పోసుకు ఛస్తాను."

ఇందిరాదేవి ఉలిక్కిపడింది. "కేదార్‌ని పిలిచి ఆ పిల్లకా చీరలేవో కొనిపెట్టమని చెప్పండి. అది అన్నంత పని చేస్తుందేమో?" భయంతో ఒణుకుతూ చెప్పింది భర్తకు.

రామశేషయ్య గారు నవ్వుతూ "పిచ్చిదానా! ఛస్తా ఛస్తా అన్న వాళ్లు చావరే!" అన్నారు ఆవలిస్తూ ఆని పడుకోమని సంజ్ఞ చేస్తూ.

"అది కాదండీ! అది నన్నూ నా పిల్లల్నీ అలా అంటూ నాకు బాధగా ఉంది."

"ఉంటే ఏం చేస్తాం? నాకా పెన్షన్ లేని ఉద్యోగమయిపోయింది. రిటైరయితే ఒచ్చిందేదో ఆడపిల్లల పెళ్లిళ్లకయిపోయింది."

"అయితే వీడికి మాత్రం పి.హెచ్.డి. వరకు చదివించి పెళ్లి చేయ్యలేదా?"

"పిచ్చిదానా? పిల్లలతో గతం మాట్లాడ కూడదు. మాట్లాడితే తన్ని తగిలేస్తారు. ఇద్దరం కలిసి ఏ హోం ఫర్ ది ఏజ్డ్‌లోనో పడుండాలి. ఆ ఉండేదేదో ఇక్కడే పడుందాం. తోచక పోతే వెళ్లి దుర్గ గుళ్లో కూర్చుందాం రోజంతా! సరేనా? పడుకో!"

"నోర్ముయ్! స్టుపిడ్... నీ వాళ్ల కోసం ఎంతో చేశాను. నీకు మాత్రం తక్కువ చేస్తున్నానా? రెండు బీరువాల చీరలున్నాయ్... ఇంకా ఏం కావాలి? ఏది చూస్తే అదే కొంటానంటావ్ చిన్న పిల్లలా..." కేదార్ స్వరం పెరగడంతో రామశేషయ్య ఇందిరాదేవి కూడా లేచి కూర్చున్నారు.

"మీరిలా అంటూనే ఉండండి. ఆ ఫ్యాన్ ఉరేసుకుని ఛస్తా" అరిచింది మేఘమాల.

"మీరు వెళ్లి కేదార్‌ని ఊరుకోమని చెప్పండి.' ' భయంగా అంది ఇందిరా దేవి.

"ఎందుకే అంత భయం? భార్యాభర్తల గొడవ మనకెందుకు? ఇప్పుడు తిట్టుకుంటారు. రేపు వాళ్లే కలుసుకుని మాట్లాడుకుంటారు ఏమీ ఎరగనట్టు. మధ్యలో మనమే చెడ్డయిపోతాం."

"నేనూ అలాగే అనుకునే దాన్ని. పొద్దుట పేపర్లో వార్త చదివేక భయం పట్టుకుంది. ఇలాగే మాట మాట పెరిగి ఒక దంపతులు దెబ్బ లాడుకున్నార్ట. అదీ పండక్కి చీరకొనలేదని. ఆ భార్య భర్తతోపోట్లాడి, తను విషం తాగి, పిల్లలకీ విషం ఇచ్చిందట. అది నిజంగా విషమనుకోని ఆ భర్త, "నీకు చచ్చే ధైర్యం కూడా ఉందా చేస్తే చావు! "అన్నాట్ట. నిజంగానే కాస్సేపటికి అందరూ చచ్చి పడున్నార్ట. వాళ్ల దెబ్బలాటలు వింటున్న అత్తా మామలు, మనలాగే వాళ్లూ సర్దుకుంటారులే అని ఊరుకున్నార్ట! తెల్లారాక అందరూ ముసలాళ్లని తిట్టారట. "పెద్దవాళ్లు మీరుండి ఏం లాభం? ఆ మాత్రం సర్ది చెప్పొద్దా? "అని అంతే కాదు. పోలీసులు వాళ్లనీ జైలుకి లాగారట. అంతవరకే రాశారు పేపర్లో!" అంది భయపడుతూ చెబుతూ.

ఆ వార్త రామశేషయ్యా చదివారు పేపర్లో! కాస్సేపు ఆలోచించి, ఇద్దరూ వెళ్లి కేదార్ బెడ్‌రూం తలుపు కొట్టారు.

కేదారు రెండు నిముషాలాగి తలుపు తీశాడు. "మీరింకా పడుకోలేదా?" అన్నాడు తండ్రిని చూసి. ఆయన సమాధానం చెప్పేలోగానే "మీరిద్దరూ దేనికో ఘర్షణ పడుతూంటే మాకు నిద్దరెలావొస్తుంది బాబు" అంటూ ఇందిరాదేవి గదిలో కెళ్లి, మంచంమీద మోకాళ్ల మీద తలపెట్టి కూర్చున్న కోడలి గడ్డం పట్టుకుని పైకెత్తింది. మేఘమాల కళ్లు ఏడ్చి ఏడ్చి ఎర్రని ఉల్లిపాయల్లా ఉన్నాయ్.

"మేఘా! పోట్లాడితే ఏం లాభం? మగవాడిని మంచి మాటలతో మచ్చిక చేసుకోవాలి." అంది నవ్వుతూ...

"అది కాదత్తయ్యా...." ఏదో చెప్పబోయింది మేఘమాల.

"నాకంతా తెలుసు. ఈ వయస్సులో నీ కోరికలు నీకుంటాయి. దాన్ని తీర్చవలసిన బాధ్యత వాడిదే కదా!" అంది.

"అదికాదు... నేను..." ఏదో చెప్పబోతూంటే మళ్లీ అడ్డుపడింది.

"నేనంతా విన్నానమ్మా... భగవంతుడి దయవల్ల నా బిడ్డలు ఏ లోటు లేకుండా ఉన్నారు. వీడిపైన వాళ్ల బాధ్యతలేముంటాయి చెప్పు. మా ముసిలాళ్లిద్దరికీ నీ పిల్లలిద్దరూ కిందా మీదా పోసే మెతుకులంత ముద్దచాలు! నీ కోర్కెలు అవి నీకో నీ వాళ్లకో మాత్రమే అయితేనేం?" అంది.

మేఘమాల ఆమె వ్యంగ్యంగా అంటోందా, నిజంగా అంటోందా, అని ఆమె కళ్లలోకి చూసింది.

ఆ ముసలి కళ్లలో ప్రేమ తప్ప, ఆందోళన తప్ప ద్వేషం కనిపించలేదు. ఇందిరా దేవి మేఘమాల తలనిమురుతూ, కేదార్ కేసి చూసి నవ్వుతూ, "బాబూ! ఒక చీరకొంటే, మరో చీర ఉచితం, ఒక గిన్నె ఉచితం, అంటూ రకరకాలుగా వస్తున్న వ్యాపార ప్రకటనలను చూస్తువుంటే ఎవరికైనా కలుగుతుంది ఆకర్షణ. ఎన్నో కొంటుంటావు. దీనికి మాత్రం ఎందుకు కాదనాలి. ఒచ్చేది సంక్రాంతి .కోడలికంట్లో నీళ్లు రానీయకు" అంది.

అత్తగారి మాటలతో కుంచించుకుపోయింది. ఎమ్.ఏ. ఎకనామిక్స్ చేసిన మాజీ లెక్చరర్ మేఘమాల!

అత్తగారి చదువు నాలుగో క్లాసే! అయినా ఆమె నాలుగు పి.హెచ్.డీలు చేసినంత చక్కగా చెప్పింది.

"ఈమెనా నేను ఈసడించుకున్నాను" తనని తానే నిందించుకుంది మేఘమాల.


"సరేలేమ్మా" అన్నాడు కేదార్.


ఇందిరాదేవీ, రామశేషయ్య వాళ్లని పడుకోమని చెప్పొచ్చి వాళ్లూ పడుకున్నారు మనశ్శాంతితో.

.......

సంక్రాంతికి ఆడపడుచులందరూ ఒచ్చారు. కొత్తగా తెరిచిన దుకాణంలో ఒక చీరకొంటే మరొక చీర ఫ్రీ... స్కీములో అందరికీ బట్టలు కొంది మేఘమాల. అందరికీ సమానంగా, ఫ్రీ చీరను కూడా వాళ్లకే ఇచ్చింది.

ఇందిరాదేవి మురిసిపోతూ కేదార్ కేసి చూసి "ఒరేయ్! చూశావా కోడలి బుద్ధి. అందరినీ సమానం






చేసింది. అందరూ ఎంతో సంతోషించారు. "నా మట్టుకు నాకు నా జన్మ ధన్యమైనట్టుంది. చాలురా! ఈ తృప్తి చాలు! ఇదే నాకు సిసలైన సంక్రాంతి" అంది.

"అమ్మా! అందరూ నీలా ఆలోచిస్తే అత్తా కోడళ్ల పేచీలుండవు కదూ?" అన్నాడు.

"అంతేకాదు. ప్రతీకోడలూ, మన మేఘమాలలా చేసిన తప్పులు దిద్దుకుని, జీవితాని కున్న అర్ధాన్నీ, పరమార్థాన్నీ తెలుసుకుంటే చాలు. స్వర్గం - నరకం ఎక్కడో లేదురా! మనందరం సంతోషంగా కలిసుంటే స్వర్గం! ఒకరినొకరు ద్వేషించుకుంటూ బతకడమే నరకం!" అంది.

మేఘమాల కొత్త చీరకట్టుకుని అద్దంలో చూసుకుంటూ మురిసిపోతూ ఈ మాటలు విని మరింత విప్పారిన మొహంతో అత్తగారికి పాదాభివందనం చేసింది.

నవ్వులు విచ్చు కున్నాయి పుష్పాల్లా అందరి పెదవుల మీద .

"మేఘా! ఈ పాదాభివందనాలూ, మంగళ సూత్రాలను కద్దుకుంటూ చేసే పూజల కన్నా, మానవత్వం విలువలు ఎంతోమిన్న .పెళ్లి రెండు పక్షాల కలయిక అయినా ప్రేమ, అభిమానం, ఆదరణ అనే భావాలను అలంకారాలుగా చేసుకుని మెలగాలి. అహంకారం, అహంభావం నావాళ్లూ ,నీ వాళ్లూ అనే తేడాలను మరిచిపోవాలి. ఒకోసారి ఎవరి వాళ్లలోనైనా కొన్ని తప్పులు జరగొచ్చు. మనకి నచ్చనివీ ఉండొచ్చు. మంచి మనసుతో వాటిని సరిదిద్దాలీ లేదా సర్దుకుపోవాలి" ఇందిరాదేవి గారి మాటలను పాఠాలు చెప్పే మాస్టారి క్లాసులోలా వింటోంది మేఘమాల.

బిలబిలమంటు ఆమె చెల్లెళ్లూ, అక్కగారూ, అమ్మగారూ అందరూ వచ్చారు. మేఘవాళ్లకేసి ఆశ్చర్యంగా చూసింది 'తను పిలవలేదే' అన్నట్టు. అది గ్రహించిన ఇందిరాదేవి 'నేను పిల్చానమ్మా', అందరూ అప్పుడప్పుడు కలవాలి. మన పూర్వీకులు పండుగల పేరిట అలా కలుసుకునేవారు. ఇప్పుడు నాగరికం పెరిగి పండగలూ సరిగ్గా చెయ్యరు. పార్టీలకు బంధువులను పిలవరు. బంధుత్వాలూ, ప్రేమలూ, అభిమానాలూ చెరువులోని నీరులా ఇంకిపోతున్నాయి. పిల్లల కసలు బంధువులెవరో తెలిసే అవకాశం కూడా పోతూంటే, అభిమానాలెలా కలుగుతాయి? అని చెబుతూ, ఆ కిందటి రోజున తన మెళ్లో ఉన్న చిన్న ముత్యాలహారాన్ని తాకట్టుపెట్టి మేఘ తరపువారందరికీ మేఘ కొన్న పద్ధతిలోనే చీరలు కొన్న విషయం చెప్పింది.

"చీరలు పెట్టడం, పెట్టకపోవడం ముఖ్యం కాదమ్మా! ఆప్యాయంగా ఆదరించడం. అందుకు సభలలో పూలదండలు వేసుకున్నట్టు, శాలువాలు కప్పుకున్నట్టు ఇదీనూ!" అంటూ తన వారిని ఇందిరాదేవి ఆహ్వానిస్తూ ఉంటే, నాలుగో క్లాసు చదువుకున్న అత్తగారి సంస్కారం ముందు తన ఎమ్.ఏ. డిగ్రీ సిగ్గుపడింది!

"మరు జన్మఉన్నదో లేదో,

ఈ మమతలప్పుడేమవుతాయో.." రేడియోలో పాట జనరంజని కార్యక్రమంలో వస్తుంటే మేఘమాల కళ్లు నీటితో నిండిపోయాయి. మనసు దూది పింజల్లా ఎటో ఎగిరిపోతూంటే, కన్నీళ్ల చూపును మసక బారుస్తుంటే కేదార్‌ని చూసి చిన్నగా నవ్వింది మేఘ. ఇందిరాదేవి విశ్వమానవ ప్రేమను పంచే మదర్ థెరిస్సాలా కనిపించింది. ఈ సంక్రాంతి తన జీవితానికే క్రాంతి! నెమ్మదిగా కళ్లు తడుచుకుంది మేఘమాల. •

